# తమ్ముడూ! తప్పుచెయ్యకూ !

"తమ్ముడూ ! బజారుకేనా వెడుతూంట ?"

పిలుపూ, ప్రశ్నవిని, వరండా చీడీలు దిగుతున్నవాడల్లా ఆగి, వెనక్కి తిరిగి చూశాడు శేఖర్.

వంటింటి గుమ్మంలోంచి, పైట చెరగుతో చెయ్యి తుడుచుకుంటూ గబగబా వస్తోంది సుశీల

మబ్బురంగు వెంకటగిరి జరీనేతచీర, అదేరంగు క్రేప్ సిల్కు జాకెట్టులో, ఆమె విద్యుల్లతలా వుందనిపించింది శేఖర్‌కు "ఊఁ!" అన్నాడు

"పనిలో పని ! కొత్త సంవత్సరం కాలెండర్లు రెండు పట్టుకురా! మరీ ప్రకృతి దృశ్యాలని పట్టుకురాకు. మీ బావగారి అభిరుచి కాదు గానీ, ఇంటినిండా జలపాతాలూ, అడవులూ, కొండలూ గోడలనిండా కిక్కిరిసి వున్నాయి. కాస్త ఏదేనా దేవుడి బొమ్మలుండేవిగా చూచి తీసుకురా, ఇదిగో చిల్లర డబ్బులు!"

"అలాగే!" చిల్లర తీసుకొని నాలుగడుగులు వేశాడో లేదో, మళ్ళీ పిలిచింది సుశీల.

"అబ్బబ్బ ! నన్నీ రోజు బయటికి వెళ్ళనియ్యవా అక్కయ్యా ? ఇంకా ఏం కావాలి !" కనుబొమ్మలు చిట్లించి

వినుగ్గా అడిగాడు శేఖర్. అలా శేఖర్ ముఖం చిన్నబుచ్చు కుంటే, బుంగమూతి పెట్టే పసిపిల్లాడి ముఖం గుర్తుకొస్తుంది సుశీలకు.

కిలకిల నవ్వింది. "మరేం లేదులే ? మీ బావగారు కనిపిస్తే ఖాతా అంగట్లో కాఫీపొడి ప్యాకెట్టొకటి పట్టుకు రమ్మన్నానని చెప్పు!"

తలాడించి ముందుకు కదిలాడు శేఖర్. అడుగులు ముందుకు పడుతున్నాయేగానీ, అతగాడి హృదయం మాత్రం వెనక్కు, సుశీల దగ్గరగా వెడుతోంది, ఎంత మందలించినా వినకుండా. మలుపు తిరగబోతూ, వెనక్కు తిరిగి చూచాడు శేఖర్. సుశీల వీధి గుమ్మంలో నిల్చుని, ఏదో కూర బేరం చేస్తోంది.

కిలకిలమని సుశీల నవ్వితే, ఆమె లేతగులాబీ బుగ్గలు సిగ్గులుదేరి, సొట్టలు పడుతూంటే, తన కెందుకో చక్కిలిగింత పెట్టి నట్లుంటుంది ఒక్కొక్కసారి తను కాలేజీనుంచి ఇంటికెళ్ళే సరికి, సుశీలా భాస్కర్‌లు ఏదో వాదించు కుంటుంటారు తను లోపలికి వెళ్ళగానే మాట మార్చేస్తారు. కానీ అ సమయంలో, బహుశ తన ఊహ ప్రకారం భాస్కర్ అనిన ఏదో కొంటెమాటకు గుర్తుగా. సుశీల బుగ్గలు ఎర్రబారి, కళ్ళు మిలమిలలాడి, అందంగా లేతగులాబిమొగ్గలా వుంటుం దామె ముఖం ! భాస్కర్ ఏమనుకుంటాడోననే భయంతో తను చూచీ చూడనట్లుండటమో, లేక ఏదో పనున్నట్లు తలొంచుకుంటాడేగానీ, లేకుంటే ఆ గులాబిరంగు బుగ్గలు చూస్తూ, అలాగే గంటల తరబడీ నిల్చోవాలనిపిస్తుంది !

అసలు మొదటి తప్పు తనదేనేమో ? 'అక్కయ్యా!' అని వరస కలుపుకున్నాడు ! 'ఏమండీ!' అనో, 'సుశీల గారూ!' అనో, 'వదినా!' అనో పిలుస్తుంటే బావుండేది ! అదేమిటో ఆ పరిచయమే తమాషాగా అయ్యింది. శేఖర్ మనస్సు గతాన్ని త్రవ్వుకుంటూ వెడుతోంది యాంత్రికంగా !

బి. యస్. సి. ఫైనలియర్ చదువుతున్న విద్యార్థి శేఖర్ ! ఆషామాషీగా హాయిగా తిరుగుతున్న అతగాడి కెదురుగా ఓ రోజు 'రూం' సమస్య పెనుభూతంలా, ఇంకా మాట్లాడితే ఇండియాలో ఆహార సమస్యంతటి భారంగానూ నిల్చుంది ! అతగాడుంటున్న రూం తాలూకు ఇంటి యజమాని మొత్తం ఇల్లంతా ఎవరో ఆఫీసరుకు బాడుగకు ఇచ్చేశాడుట, ముందస్తుగా శేఖర్‌కు ఎలాటి వార్నింగూ ఇవ్వకుండానే !

"సాధ్యమైనంత త్వరలో నువ్వు రూం ఖాళీ చెయ్యి నాయనా !" అన్నాడు పైపెచ్చు !

శేఖర్‌కు ఒళ్ళుమండింది, "ఇంత హఠాత్తుగా చెబితే ఎలాగండీ?" అన్నాడు కోపంగా !

"నేనేం చెయ్యను ? పరిస్థితు లిలా వచ్చాయి!" అని నాన్చేశాడా మహానుభావుడైన గృహ యజమాని.

ఇక శేఖర్ చేయగలిగిందేముందీ? కాళ్ళీడ్చుకుంటూ, రూం వేట ప్రారంభించాడు చాలామంది ఇళ్ళల్లో రూంలు అయితే వున్నాయిగానీ 'బ్రహ్మచారికి మా రూం బాడుగకు ఇవ్వం!' అనే రూల్సుకూడా వున్నాయి వాళ్ళదగ్గరే, అక్క

డికి బ్రహ్మచారులే సర్వఅరిష్టాలకూ అధిష్టాన దేవతలనే అర్థం వచ్చేలా ! మరికొన్ని రూమ్స్‌లో ఒక్కో గదిలో ముగ్గురూ, నలుగురూ కాలేజీ కుర్రాళ్ళు కలిసికట్టుగా వుంటు న్నారు. అలా తను ఇమడలేడని శేఖర్‌కు బాగా తెలుసు.

విసిగివేసారి పార్కులో కూర్చుని ఆలోచిస్తున్న శేఖర్‌కు కాస్తదూరంలో ముదురు నీలంరంగు పేంటూ, లైట్‌బ్రౌన్ టెరిలిన్ బుష్‌షర్టుతో భాస్కర్ కనిపించాడు. ఒకరి నొకరు పలుకరించుకున్నారు. ఐదు నిముషాల్లో ఒకరి సొద మరొకరితో వెళ్ళబోసుకున్నారు. భాస్కర్ మరో కాలేజీ లెక్చరర్, పెద్దయిల్లు, చిన్న సంసారం. ఎక్కువ బాడుగ. ఇదీ భాస్కర్ సమస్య ?

శేఖర్‌కు మెరుపులాటి ఊహ వచ్చింది.

'మాస్టారూ ! మీదీ, నాదీ కాస్త తేడాగా ఒకే రక మైన బాధ, ఇల్లు పెద్దదై మీకు బాధ! అసలు గది అనేది దొరక్క నా బాధ ! వుయ్ అర్ సైలింగ్ ఇనది సేమ్ బోట్ ! సో .... మీ మేడమీది గది నేవాడుకుంటాను ! బాడుగ ఇచ్చుకుంటాను మీకే ! మీలో ఓ మనిషిగా వుంటాను. మీ కెలాటి ఇబ్బందులూ కలిగించను ... ఏ మంటారు ?"

భాస్కర్‌కేమీ అభ్యంతరం తోచలేదు. "అలాగే!" అన్నాడు !

సంతోషంతో చప్పట్లు చరవ్వాలనిపించింది శేఖర్‌కు !

కానీ ప్రక్కనే భాస్కర్‌లాటి పెద్దమనిషి వున్నాడని ఆ పని మానేసాడు....

ఇంట్లో అడుగెట్టగానే, బిల బిలా నలుగు రైదుగురు పిల్లలు చీమిడి ముక్కులతో, చింపిరి తలలతో పరుగెత్తుకు వస్తారనీ, వాళ్ళ వెనక ఆ గోల భరించలేక, చిరాకుపడ్తూ, పిల్లల్ని తిట్లతో దీవిస్తూ, సగటు హిందూగృహిణి ఆకారంలో ఇల్లాలూ పరుగెత్తుకు వస్తూ, తమ కెలాగో స్వాగతం జరుగు తుందనీ వూహించుకుంటూ, ఆ తాకిడీ తట్టుకొనేందుకు ధైర్యాన్ని కూడదీసుకుంటున్న శేఖర్‌కు - భాస్కర్ ఇంటి వాతావరణం, హఠాత్తుగా ఐస్ వాటర్‌లోకి అతగాణ్ణి విసిరి వేసి నట్లయ్యింది ! వెనువెంటనే ఆనందమూ కలిగింది. పరి శుభ్రంగా - అందంగా వున్న మేడ, చుట్టూ కాంపౌండ్ వాల్, బంగళాలో మల్లె బారులుతీరి గులాబి మొక్కలూ, బంతి, డిసెంబరు పూల మొక్కలు, చక్కగా ఓ పక్కగా వున్నాయి ! మల్లెపందిరి నిండా ప్రాకి, మొగ్గ తొడుగుతోంది! వరండాలో ముచ్చటగా మూడు అధునాతన ఫ్రేముకుర్చీలూ, టీపాయ్ ! వాకిలికి పలచటి గళ్ళ కర్టన్ ! కిటికీలకు హాఫ్ విండో కర్టెన్స్ !

"పరిసరమే ప్రాణానికి హాయికలిగిస్తోంది." అను కున్నాడు శేఖర్; ఆ వెంటనే "ఇల్లు ఇంత పరిశుభ్రంగా వుంచగలిగిన ఇల్లాలు కొద్దోగొప్పో చదువూ. సంస్కారమూ. అందమూ గలదై వుండాలి" అనికూడా ఊహ కలిగిం దత

గాడికి

"సుశీలా! ఇలారా!" గట్టిగా పిల్చాడు భాస్కర్, వరండాలో ఓ కుర్చీలో తను కూర్చుంటూ మరో కుర్చీలో, శేఖర్‌ను కూర్చోమని చెప్పి.

"వస్తున్నా!" సన్నని మృదుమధుర కంఠ స్వరంతో బాటు, తెల్లగా, పొడుగూ పొట్టికాని సమఎత్తులో బంగారు తీగెలాబయటకి వచ్చిన సుశీలనుచూడగానే శేఖర్‌కు ప్రాణం తెరిపిన పడింది!

"ఇతగాడు శేఖర్! ప్రస్తుతం బి యస్ సి. ఫైనల్ యియర్ చదువుతున్నాడు. మనమేడ గదిలో అద్దెకుంటాడు ఈ రోజునుంచీ!" అన్నాడు భాస్కర్, శేఖర్‌ను సుశీలకు పరిచయం చేస్తూ. అంగీకారంగా తలూపింది సుశీల.

"ఈవిడ నా భార్య సుశీల!" శేఖర్‌కు పరిచయం చేశాడు భాస్కర్.

"నమస్కారం అక్కయ్యగారూ!" అన్నాడు శేఖర్ చప్పున కుర్చీలోంచి లేచి. సుశీల విపరీతంగా అలంకరించుకొని లేదు. అట్టే వయస్సు మీరిన వనితకూడా కాదు కానీ ఆ ముఖంలో ఏదో తెలియని గాంభీర్యం, గౌరవం గూడుకట్టుకొని వున్నాయి. ఎదుటి మనిషిచేత తలవంచచేయగల వర్చస్సేదో ఆమెలో వున్నట్లనిపించింది శేఖర్‌కు! అందుకే అతగాడు అప్రయత్నంగానే 'అక్కయ్యగారూ!' అనేశాడు.

"ఈ పూట ఇక్కడే భోంచెయ్యి తమ్ముడూ! రేపట్నుంచి హోటల్ కెడుదూగానీ!" అంది సుశీల.

యాంత్రికంగా తలూపాడు శేఖర్.

"అదుగో ఆ హాలులోంచి మేడమెట్లు, రూం చూడ దల్చుకుంటే...." భాస్కర్ మాటల్ని మధ్యలోనే త్రుంచే శాడు శేఖర్.

"అక్ఖర్లేదు మాస్టారూ !"

ఆ రోజు రాత్రి శేఖర్ పొందిన ఆనందానికి హద్దు లేవు ! చదువూ సంస్కారమూ వున్న చిన్న జంట తనకు తోడు ! చక్కగా, పొందికగా వున్న ముచ్చటైన ఇల్లు తనకు నీడ ! అంతకంటే ఇంకేం కావాలి ? రోజులు చల్లగా దొర్లిపోతున్నాయి నిశ్చింతగా ! అన్నిటికంటే శేఖర్‌కు నచ్చిన అంశం సుశీలా, భాస్కర్‌ల అన్యోన్యతతోబాటు, వారి నిష్కల్మష ప్రవర్తన, నిక్కచ్చి అయిన పద్ధతులు ! ఓసారేదో చిన్న వస్తువుకొని పట్టుకురమ్మంది సుశీల శేఖర్‌ను....

"ఉండు తమ్ముడూ, డబ్బులిస్తాను" అంటూనే లోప లికి వెళ్ళబోయింది.

"వద్దండీ ! నా దగ్గరుంది ! అదేం పెద్ద వస్తువులా ఏమిటి ? పదిపైసల వస్తువుకు మీరు డబ్బివ్వాలా !" మొహ మాటంగా జవాబిచ్చి బయల్దేరబోయాడు శేఖర్ !

చప్పున సుశీల పిలిచింది. "పదిపైసల వస్తువైనా, పదిరూపాయలదైనా-డబ్బు ఇవ్వకుండా, నేను తెప్పించుకోవటం, నువ్వు తెచ్చిపెట్టటం సబబుకాదు తమ్ముడూ ! అసలు స్నేహాలూ, బంధుత్వాలూ నిష్కల్మషంగా, నిరపాయంగా కొనసాగాలంటే, డబ్బుదగ్గర ఏలాటి మొహమాటాలూ,

వుండకూడదు. స్నేహానికీ - బంధుత్వానికీ, డబ్బుకూడ ఏలాటి లంకే వుండకూడదు!" అంటూనే పదిహైసలు చేతిలో వేసింది!

ఇంకా సందేహిస్తున్న శేఖర్‌ను చూచి భాస్కర్ చిరు నవ్వు నవ్వాడు.

"మా సుశీ అభిప్రాయం సబబైందే శేఖర్ ! అందుకే మా సుశి నిశితంగా ఆలోచించి నిర్ణయించే ఏ పద్ధతికీ. పనికీ నేను అభ్యంతరంగానీ, అడ్డుగానీ చెప్పను....ఊ ! తీసుకో!" అన్నాడు.

అంతే ఇక శేఖర్‌కు ఏ విషయంలోనూ సందేహం అంటూ లేకుండా పోయింది.

ముగ్గురు స్నేహితులు ఇంట్లో వుంటున్నారు ! అనిపించే దతగాడికి తరచూ !

రోజులు గడిచేకొద్దీ, శేఖర్ ఆ ఇంట్లో మూడోవ్యక్తిగా బాగా కలసి పోయాడు.

భాస్కర్‌ను మాత్రం 'మాస్టారూ ! మీరు ! వగైరా బహువచన ప్రయోగాలతో సంబోధించినా, సుశీలను మాత్రం 'అక్కయ్య ! నువ్వు !' అంటున్నాడు. సుశీల కూడా చనువుగా 'తమ్ముడూ!' అని పిలుస్తూ, కబుర్లు చెబుతుంటుంది.

చాలాసార్లు భాస్కర్, సుశీల ఏదో చర్చలో వున్న ప్పుడు శేఖర్ రావటం జరిగేది.

"నువ్వే చెప్పు తమ్ముడూ! మీ బావగారి దంతా ఆక తాయితనం గాకుంటే, ప్రేమించి పెళ్ళిళ్ళు చేసుకుంటేనే. దాంపత్య జీవితం హాయిగా సాగుతుందిట.... లేకుంటే లేదుట! శాస్త్రరీత్యా, పెద్దలు మాత్రం నిర్ణయించి చేసిన మా ఇద్దరి పెళ్ళివల్ల. మా దాంపత్య జీవితంలో ఏం లోటు కనబడు తోంది?" అంది సుశీల ఓ సారి! శేఖర్‌కు సమాధానం చప్పున తోచలేదు

భాస్కర్ ఇల్లెగిరిపోయేలా నవ్వాడు.

"మండన మిశ్రుని భార్య భారతీదేవి, నీలానే శంకరా చార్యులను ఏదో ప్రశ్న వేసిందట! ఆ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవ టానికి శంకరాచార్యులు, పరకాయ ప్రవేశం చెయ్యాల్సి వచ్చిందట! అలాగేవుంది నీ ప్రశ్న! శేఖర్ బ్రహ్మచారి! అతగాడి కేంతెలుస్తుంది ఇలాటి ప్రశ్నలకు జవాబు?"

సుశీల చల్లగా లోపలికి వెళ్ళిపోయింది, "పాలు పొంగుతున్నాయి!" అంటూ సాకుపెట్టి. బహుశా ఆమెకూ తన పొరబాటు అర్థ మయ్యుంటుంది!

కానీ శేఖర్‌కు మాత్రం భాస్కర్ మీద కాస్తకోపం వచ్చింది. మాస్టారివుద్దేశ్యంలో తను ఏమీ తెలియని అర్భకు డని కాబోలు! అవకాశం ఇస్తే, అరగంటేనా ప్రేమ వివా హాల పుట్టు పూర్వోత్తరాలుకూడా తను చెప్పగలడు! ఏం లాభం? మాస్టారూ ఇవ్వలేదా అవకాశం, ఆవిడా తిన్నగా జారుకుంది.

బి.యస్.సి పాసై, ఎం.యస్.సి.లో చేరాడు శేఖర్ అక్కడే! కానీ ఎమ్.యస్.సి లో చేరిన శేఖర్‌లో మరో శేఖర్ మెల్లగా తలెత్తుతున్నాడు! అలోపలున్న శేఖర్, ఇంతక్రితంలా ఏ స్త్రీవేపు చూచినా, ఏ వూహలూలేని పసిపిల్లాడిలా. అమాయకంగా వుండటంలేదు? క్షణకాలం కళ్ళూ, మెదడూ చలనం మానివేస్తున్నాయి! సుశీల విషయంలో అయితే మరీనూ! సుశీల నవ్వినా, మాట్లాడినా, ఏ వస్తువేనా అందుకోవటంలో చెయ్యితగిలినా, గుండె ఝల్లుమంటోంది. ఆ అనుభూతి తాలూకు కంపన ఐదారుసెకండ్లు అలాగే నిలిచి వుంటోంది. ఇప్పుడామెను 'అక్కయ్యా!' అనాలనిపించటం లేదు. ఆమె తనను 'తమ్ముడూ!' అన్నా ఎలాగో వుంటోంది తనకు? అ వరస కాకుండా మరొకటైతే ఎంత బావుండో! అనిపిస్తోంది తరచూ!

"శేఖర్! ఎక్కడికోయ్?" ఎదురుగా భస్కర్ నిల్చుని ప్రశ్నిస్తున్నాడు వులిక్కి పడ్డాడు శేఖర్! గతమంతా ఆలోచిస్తూ, దృశ్యాలుగా వూహించుకుంటూ మెయిన్ రోడ్డు దాటి. మార్కెట్ దగ్గర కొచ్చాడు తను చప్పున ఇహ లోకంలోకి వచ్చి-తన స్థితి-తను చెయ్యవలసిన పనీ-గుర్తుకు వచ్చాయి శేఖర్‌కు!

పరధ్యాన్నం కప్పిపుచ్చుకుంటూ "ఫ్యాన్సీ షాపులో కొన్ని వస్తువులు కొనాలి మాస్టారూ! మీరు కనిపిస్తే త్వరగా ఇంటికి రమ్మంది అక్కయ్య!" అన్నాడు శేఖర్.

"ఎలాగూ వెళ్తూనే వున్నాగా? ఈ లోపల హంస దూతగా నిన్ను పంపింది కాబోలు!" నవ్వుతూ వెళ్ళి

పోయాడు భాస్కర్. తీరా భాస్కర్ దూరంగా వెళ్ళాకగానీ గుర్తు రాలేదు శేఖర్‌కు, కాఫీపొడి ప్యాకెట్టు విషయం !

ఓహ్ ! నేనే ఒకటి కొని పట్టుకెళ్తే తీరిపోయె ! ఎలాగూ పైసాలతో సహా లెక్కకట్టి మరీ ఇస్తుందావిడ ? అనుకున్నాడు శేఖర్ ఫ్యాన్సీ షాపులోకి అడుగెడ్తూ !

*　　*　　*

"ఇదిగో అక్కయ్యా కేలండర్స్ !" టేబుల్‌మీదుంచి గట్టిగా కేకవేశాడు శేఖర్.

చేతిలో పనివదలి గబగబవచ్చింది సుశీల. ఆసక్తిగా, చుట్టచుట్టి వున్న కేలండర్లువిప్పి చూసింది. మరునిమిషంలో పొట్టచెక్కలయ్యేలా నవ్వటం మొదలుపెట్టింది.

"ఏం ? ఎందుకానవ్వూ ! ఇవి బాగా లేవా అక్కయ్యా?" ఆదుర్దాగా అర్థంగాక అడిగాడు శేఖర్.

"ఇదేమిటి తమ్ముడూ ! వీళ్ళిద్దరూ ఎవరూ?" నవ్వాలాగో ఆపుకుంటూ ఓ కేలెండర్ మీద బొమ్మ కేసిచూస్తూ అడిగింది సుశీల.

"నిజంగా తెలీకే అడుగుతున్నావా అక్కయ్యా ! రాధాకృష్ణులు!" అంతచక్కటి చిత్రంచూస్తూ అంతగా నవ్వాల్సిన అవసర మేమిటో బోధపడక చిరాకు కలిగింది శేఖరుకు !

"ఓహ్! రాధాకృష్ణులా? ఈ చిత్రకారు డెవరోగానీ తమ్ముడూ! ఇలాటి చిత్రాలుగీసి ప్రేక్షకుల కళ్ళు ఇక ముందేనా పొడవకుండా వుంటే బావుండు!" అందినవ్వు తెర ఆపుకుంటూ.

"ఇంతకూ ఆ చిత్రంలో నీ క్కనిపించిన లోప మేమిటో?" కుతూహలమూ, కోపమూ సమ్మిళితమై, శేఖర్ స్వరం కంపిస్తోంది.

"అలాఅడిగావు బాగుంది. ముందలా స్తిమితంగా కూర్చో?"

స్టూల్‌చూపించింది సుశీల. శేఖర్ కూర్చున్నాడు.

"ఇలా చూడు తమ్ముడూ! వేణువొకచోట, చేతులూ, పెదవులూ మరోచోట, కడవంత బొజ్జతో, కాళ్ళు పారజాపుకుని, చెట్టుకు జేరగిలబడి, వెకిలి నవ్వులు నవ్వుతూ, వెర్రి చూపులు చూస్తున్న ఈ మహానుభావుడు కృష్ణుడా? అది చాలదన్నట్లు శరీరచ్ఛాయకు వేసిన ఈ నీలిరంగు చూడు - ఎంత ముదరగా, ఎలా జిడ్డుగారుతున్నట్లుందో? నారాయణ! నారాయణ! వేణుగాన లోలుడూ, గోపీజన మనోహరుడూ అయిన ఆ జగన్మోహనమూర్తి ఛాయలేనా ఈ చిత్రంలో వున్నాయా? అసలీ కృష్ణుణ్ణి చూస్తుంటే, నాకెవరు గుర్తొస్తున్నారో చెప్పనా?"

"చెప్పు!" ముభావంగా అన్నాడు శేఖర్.

"ఏ వివాహ సందర్భంలోనో, కర్మాంతరాల్లోనో, పీకలమొయ్యా విందుభోజనం చేసి, కూర్చుని లేవలేక, అప

సోపాలు పడ్తున్న తిండిపోతు బ్రాహ్మణుడు." సుశీల ఇక ఆపుకోలేక పక పక నవ్వేసింది! శేఖర్‌కూ ఆమె చెప్పిన ఉపమానం నవ్వకూడదనుకున్నా, నవ్వు తెప్పించింది !

"పోనీ రాధనేనాచూచి సరిపెట్టుకుందామా అంటే?" సుశీల ఆగింది.

రాధలో ఈవిడకేం లోపం కనిపిస్తుందో? అసలు తను ఫ్యాన్సీషాపులో అడుగెట్టడంతోనే ఆకర్షించిందీ చిత్రం! కృష్ణుడివేపు తను సరిగా చూడనేలేదు. కానీ రాధ తన కళ్ళ నలాగే రెప్పవేయకుండా వుంచగలిగింది! కృష్ణుడికొక్కాస్త దూరంలో పచ్చగడ్డిమీద వయ్యారంగా పడుకుని వేణు గానాన్ని వింటోంది. ఆమె రెండుచేతులూ వెనక్కువిరచి తలక్రింద పెట్టుకొని, చిరుగాలికొక్కాబోలు 'పై మీది పమిటి అల్లల్లాడుతూ' వుండలేనని పిస్తోంది అనుకున్నాడు శేఖర్ లోలోపల.

"మరి రాధకేం ?" అన్నాడు పెద్దగా.

"ఏముందీ? పచ్చి సానివేషాలు వేస్తోంది!" అంది. మాట్లాడ లేకపోయాడు శేఖర్.

"పోనీ ఈ రెండోచిత్రం చూడు. ఇదీ నచ్చకుంటే, దేవుడా అంటూ తిరిగివెళ్ళి వాపస్ ఇచ్చేసి వస్తాను!" అన్నాడు రోషంగా !

"ఈవిడ దుర్గాదేవా ?"

"కాదామరి!" కోపంగా చూశాడు శేఖర్.

"ఊహుఁ ! ఓ సినీతార కళ్ళు, మరోముఖం, ఇంకో సినిదేవత హేర్‌స్టైయిల్ ! ఇలా ఫలానాతార ! అనేనా తేల్చకుండా, పులగంగా తన మనసులో మెదిలిన సినీతారలందర్నీ కలిపి-దుర్గాదేవిగా దిద్దేశాడీ చిత్రకారుడు ! ముల్లోకాలకూ తల్లిఅయిన దుర్గాతల్లి జానెడు నైలాన్ పేలికలు చుట్టుకుంటున్నట్లు చిత్రించిన ఈ చిత్రకారుని దృష్టి ఎంత సంకుచితమైందోచూడు ? మహిషాసురుణ్ణి వధిస్తూ, ఓరగా, క్రీగంటు నవ్వుతూ - కవ్విస్తూ చూస్తోంది చూడు తల్లి!"

శేఖర్ మాట్లాడలేదు ! కానీ కోపంతో అతగాడి ముఖం ఎర్రగా కందిపోవడం మాత్రం సుశీల గ్రహించింది క్షణంలో.

"అలా కోప్పడకు తమ్ముడూ ! మృదువుగా పిలిచింది సుశీల.

"నువ్వూ కొద్దోగొప్పో బొమ్మలు గీస్తావని నాకుతెలుసు. అందుకే ఇంతగా విమర్శిస్తున్నాను...." అంతలోనే గంభీరంగా మారింది సుశీల కంఠస్వరం. "తమ్ముడూ ! చిత్రకారుడైనా, శిల్పి అయినా, స్త్రీమూర్తిని సృష్టించ దల్చుకుంటే, ముందస్తుగా నిగ్రహం సంపాదించుకోవాలి. చిత్రకారుని కుంచెగానీ, ఉలిగానీ. స్త్రీ రూపకల్పన సమయంలో, ఆమె మెడవరకూవచ్చి ఆగినా, చలించినా, పిరికనలు స్త్రీమూర్తిని రూపకల్పనచేసే అర్హతేలేదంటాను తమ్ముడూ ! ముందు హృదయంలో పవిత్రత, ఆ తర్వాత నిగ్రహం, అటు

పైన నిశ్చలమైన ఏకాగ్రతా లేకుంటే ఏ కళా రాణించదు. ముఖ్యంగా చిత్రకళ ! ఇప్పుడీ కేలండర్లే చూడు. ఇవే కాదు. మరెన్నో ఇలాటి కేలెండర్లున్నాయి. వాటిమీద చిత్రింపబడే దేవతా స్త్రీ మూర్తులలో పవిత్రతా. గాంభీర్యమూ గోచరించటంలేదు. వారిని చూస్తే మనకు భక్తిభావం కలగటానికి బదులు, ఏదో జుగుప్సాభావం కలుగుతోంది.

"లేకుంటే, పవిత్ర ప్రణయానికి చిహ్నంగా, ప్రతిరూపంగా, మనందరం నిత్యం కొలిచే రాధామాధవులు ఇలాగేనా వుండేది ? వారిని చూస్తుంటే నామటుకు నాకు బాధాకరంగా వుంది. కలలో పిలిచినా పలుకుతుందనిపించే దుర్గాతల్లి, అలా చాలీచాలని చింకి పీలికలతో ప్రత్యక్షమైతే పెద్దగా ఏడవ్వాలనిపించదూ?"

శేఖర్ పూర్తిగా సహనం కోల్పోయాడు. కేలెండర్లు గబగబా చుట్ట చుట్టేశాడు లేచి నిల్చుంటూ ! అతగాడి ఉద్దేశ్యం గ్రహించింది సుశీల.

"ఒద్దు, ఒద్దు. అని అంతదూరం తరిగివెళ్ళి వాపస్ ఇవ్వొద్దులే తమ్ముడూ ? ఎన్నో సినీతారల కేలెండర్లు భరించటంలే ? మీ బావగారి ప్రకృతిదృశ్యాలు చూడటంలే ? ఇవీ అలాగే భరిస్తాలే!" నవ్వుతూ అతగాడి చేతిలోని కేలెండర్లు తీసుక లోపలికి వెళ్ళింది సుశీల. మేడమీదకు వెళ్ళిన శేఖర్‌కు మతిపోయినట్లనిపించింది క్షణకాలం. మళ్ళీ ఆలోచనలు ఈగల్లా ముసురుకున్నాయి అతగాడి చుట్టూరా !

ఈ విడతత్వమేమిటో తనకు బోధపడటంలేదు. నవ్వొస్తుంది. ఏ భావమూ ద్యోతకం కానివ్వదు. అసలా కబుర్లో? అరిందాల్లా! స్త్రీ ప్రకృతే చిత్రమైందేమో? శారీరకంగా, మానసికంగా కూడా పురుషునికంటే చిన్న వయసే అయినా, పెద్దదానిలా వ్యవహరిస్తుంది! ఈవిడా అంతే! తనకంటే సంవత్సరమో, రెండు సంవత్సరాలో పెద్దదో అదీలేదో, కానీ ప్రపంచంలోని అన్నివిషయాలూ తనకే తెలిసినట్లు మాట్లాడుతుంది. ఆ మాటల్లో "నీకేంతెలుసు? నువ్వ పసిపిల్లాడివే సుమా!" అనే భావమే ద్యోతకమౌతుంది.

అదే తనకుబాధ! ఎమ్. ఎస్. సి. ఫస్టియర్ లోకి వచ్చిన తనింకా పసివాడేనా? అదేదో పాటలో చెప్పినట్లు 'సన్నని మీసంతో విలాసం చిందులు వేస్తుంటే' ఇంకా ఓ నాలుగేళ్ళ కుర్రాడికి చెప్పినట్లు నచ్చచెప్పడమూ, మందలించడమూ చేస్తుందీవిడ?

ఆవిడను గురించి అస్తమానూ తనకాలోచనేమిటి? ఏం? తప్పేముందీ? సుశీల తన స్వంత తోబుట్టువేమీకాదు. అందరు స్త్రీలలానే ఆవిడా ఓస్త్రీయే! అలాటప్పుడు తనకావిడను దగ్గరగా చూస్తుంటే లేనిపోని వూహలేవో రావటంలో తప్పేమీ లేదు!

'అక్కయ్యా!' అని సరస కలిపినంత మాత్రాన ఇప్పుడు మిగిలిపోయిందేముందీ?

- టేబిల్ మీదున్న అసంపూర్తి చిత్రం హెచ్చరిస్తోంది. రంగు పెన్సిల్ చేతికి తీసుకున్నాడే గానీ ఒక్క అంగుళం

ముందుకు జరగటంలేదు. చెవులో సుశీల మాటలు ప్రతిధ్వ
నిస్తున్నాయి 'స్త్రీ రూపకల్పన సమయంలో, ఆమె మెడ
వరకూ వచ్చి ఆగినా, చలించినా, వారి కసలు స్త్రీ మూర్తిని
రూపకల్పన చేసే అర్హత లేదంటాను ! ముందు నిగ్రహం....'

అబ్బబ్బ ! కిలకిలమని నవ్వే ఆమె నవ్వు, ఆ నవ్వుతో
బాటు పూలతీవెలా వూగే సుశీల శరీరమూ, ఆ సమయంలో
చికిలించుకుపోయే ఆమె సోగకళ్ళూ, సొట్టలుపడే బుగ్గలూ,
అస్తమానూ తనను వెంటాడుతూనే వున్నాయి ! ఒక్కొక్కసారి
అలాగే నవ్వుతూ, ఉపన్యాసాలూ దంచేస్తుంది ఆ మధ్యొక
సారి ఓ సంఘటన జరిగింది తను తీరిగ్గాకూర్చుని, వంట చేసు
కుంటున్న సుశీలను ప్రశ్నించాడు.

"అక్కయ్యా ! కలం స్నేహాన్ని గురించి నీ అభిప్రాయ
మేమిటి ?" అంటూ సరదాగా !

"కొంచెం సేపలా గుమ్మంలో కూర్చో తమ్ముడూ !
పులుసులో తిరగమోతపెట్టి, నీ ప్రశ్నకు జవాబుచెబుతాను"
అంది నవ్వుతూ

వంటింటి గుమ్మంలో కూర్చుని తదేకంగా చూడ
సాగాడు. పీట మీద కూర్చుని అటువేపు తిరిగివున్న
సుశీల జడ నేలమీద జీరాడుతోంది - పట్టుకుచ్చులా! ఎర్రని
జరీఅంచు నేతచీరె, తెల్లగాన్సొక్క జాకెట్టులో, దివినుండి
అప్పుడే నేలరాలిన పారిజాత పువ్వులా వుందనిపించిందా
క్షణంలో ! అంతలోనే సన్నని మబ్బుతునకలాంటి భావం
హృదయంలో దోబూచులాడటం మొదలెట్టింది ! ఇంతటి

సంస్కారమూ, రూపమూగల ఇల్లాలును పొందగలిగిన భాస్కర్ ఎంతటి అదృష్టవంతుడో ? అదే ఈర్ష్యాపూరిత భావన క్షణకాలం అతగాడికి ఊపిరి తిరగనివ్వలేదు.

"అదేవిటి తమ్ముడూ! కొత్తవిద్య అభ్యసిస్తున్నట్లున్నావ్! రెప్పలార్పడం మర్చిపోయావా ? లేక హిందీ సినిమా హీరోల పిచ్చచేష్టలు అనుకరిస్తున్నావా?" వంట పటకారు శుభ్రంగా కడుగుతూ, అడిగింది సుశీల నవ్వుతూ ఇహలోకంలోకి వచ్చాడు తను !

"కలం స్నేహాన్ని గురించి కాదూ అడిగావ్ ? పవిత్రంగా చేసే ఏ స్నేహమయినా మంచిదే తమ్ముడూ ! కానీ మన యువతీ యువకులకింకా అంతటి విశాలదృక్పథం ఏర్పడిందా ? కలం స్నేహం అనగానే కొన్ని చౌకబారు కథలు గుర్తుకొస్తున్నాయి. ఓ అమ్మాయీ అబ్బాయీ మారుపేర్లతో ఉత్తరాలు వ్రాసుకోవడం, ఉత్తరాలద్వారా ప్రేమించుకోవడం, చివరకు ఎలాగో పెళ్ళిళ్ళు చేసుకోవడం: ఇదీ ఆ కథల సారాంశం ! ఇలాటి కథలు తరచూ వెలువడటంతో, కలం స్నేహం ప్రేమ లేఖలుగా మారిపోతోంది. యువతీయువకులలో చులకన భావాన్ని రేకెత్తిస్తోంది!"

"అక్కయ్యా!" దీనంగా అరిచాడు తను

"అదేం కుదరదబ్బాయ్ ! ప్రశ్న అడగటం నీవంతూ? జవాబు పూర్తిగా వినకుండా ఆపమనటమూ నీ వంతేనా ? అలావదలను, జవాబు పూర్తిగా వినాల్సిందే?"

సుశీల మాటలకు ఫక్కున నవ్వొచ్చింది తనకు. సుశీల చెప్పుకుపోతోంది....

'ఒక పరిసరం తాలూకు వాతావరణాన్నీ, ఆచార వ్యవహారాలనీ, మనస్తత్వాలనీ, మరొకరికి పరిచయంచేసి, విజ్ఞాన సంబంధమైన విషయాలు ఓప్రాంతంవారు మరో ప్రాంతాలనుంచి తెలుసుకోవటానికి ప్రయత్నించటం నిజమైన కలంస్నేహం తమ్ముడూ!" అలాకాక ప్రేమాయణం కోసం ఉత్తరాయణం జరిపే మూర్ఖుల కలంస్నేహాలు...."

ఆ సరికే తను మేడమెట్లు మీదున్నాడు, అలా వింటూంటే ఆవిడ వుపన్యాసం ఇక పూర్తవదనే భయంతో! వెనకనుంచి తన భయాన్ని పసిగట్టి, కిలకిల నవ్వుతున్న సుశీల నవ్వు, గాలికి తేలివచ్చే మంచిగంధపు సువాసనలా, తనను మత్తెక్కించింది క్షణకాలం. అలా నవ్వుతున్నప్పు డామె పూలతీవెలా, ఇంద్రధనుస్సులా, విద్యుల్లతలా వుంటుందనే ఉపమానాలూ తోచాయి చప్పున !

మరోమారూ అలాగే జరిగింది. సుశీలా, భాస్కర్ కూర్చుని ఏదో కబుర్లాడుకుంటున్నారు.

"మాస్టారూ ! మా లెక్చరర్ గారొకాయన, హఠాత్తుగా ఈరోజు మా క్లాస్ మేట్ అయిన ఓ అమ్మాయిని రిజిష్టర్ మేరేజ్ చేసేసుకున్నారండీ ! అన్నాడతను హుషారుగా, ఓ పెద్ద బ్రహ్మాండ భాండాన్ని బద్దలు కొట్టానన్న సంతోషంతో !

భాస్కర్ "ఊ!" అంటూ నవ్వేశాడు.

సుశీల మాత్రం చిరునవ్వు నవ్వి వూరుకోలేదు. "అందుకే తమ్ముడూ! రానురాను గురుశిష్యసంబంధాల విలువ కూడా పడిపోతోంది! సినిమాలు, కథలూ, ఎక్కడచూచినా, ఓ మాస్టారో, లెక్చరరో తన క్లాసు విద్యార్థినిని ప్రేమిం చెయ్యడమే! అదో ఘనతగా భావిస్తున్నారు ఇప్పుడు గురువులూ-శిష్యులూ! అంతేగానీ, మనిషిగా తీర్చి దిద్దటానికి విద్యను బోధించే గురువు తండ్రితో సమానుడని విద్యార్థినులకు గానీ, ఆవిద్యార్థినులకు తాను తండ్రి వంటి వాడిననే భావన గురువులోగానీ బొత్తిగా లోపిస్తోంది అధునాతనయుగంలో".

"అక్కయ్యా? నీ ముందీ కబురు నేరక చెప్పాను...." లెంపలు వాయించుకున్నాడు తను.

భాస్కర్. సుశీల పక పక నవ్వేశారు....

* * *

"తమ్ముడూ ! శేఖర్ ! తమ్ముడూ....!"

క్రింద మెట్లదగ్గర పిలుపు వినిపించటంతో త్రుళ్ళిపడ్డాడు శేఖర్. చేతిలో అసంపూర్తిగా వున్న చిత్రాన్ని అలాగే టేబిల్ మీద పడేసాడు.

"తమ్ముడూ!"

అబ్బె ! మళ్ళీ అదేపిలుపు ! తమ్ముడూ ! తమ్ముడూ! అంటూ ! లోలోపల విసుక్కుంటూ మెట్లుదిగి వచ్చాడు శేఖర్.

"నీకేదో పోస్టువచ్చింది!" కార్డు చేతికిచ్చి వెళ్ళిపోయింది సుశీల, నిట్టూర్చి మేడమీది కెళ్ళాడు శేఖర్.

—అద్దం ముందు స్టూలు మీద కూర్చుని జడల్లుకుంటున్న సుశీల అద్దంలోకి చూచి ఉలిక్కిపడింది రూం బయట గోడ వారగా నిల్చుని అద్దంలోకి చూస్తున్న వ్యక్తి భాస్కర్ కాడనీ, శేఖర్ అనీ తెలుసుకోవడానికి ఆమెకు క్షణం పట్టలేదు. సరిగ్గా అద్దంలో తను కన్పించే కోణంలో నిల్చుని అతగాడు తనను పరికించి చూస్తున్నాడు. ఎందుకో శరీరమంతా జలదరించినట్లయ్యింది సుశీలకు.

"ఏం తమ్ముడూ? ఏంతసేపైంది వచ్చి? ఏమైనా కావాలా?" ఏమి తెలియనట్లే. చటుక్కున వెనక్కు తిరిగి, జడ వెనక్కు వేసుకుని, నింపాదిగా అడిగింది సుశీల.

పట్టుబడ్డ దొంగలా బిత్తర పోయాడు శేఖర్.

"ఆహాఁ! ఇప్పుడే వచ్చానక్కయ్యా! నువ్వు జడల్లుకుంటూంటేనూ..." మాటలకు తడుముకున్నాడు శేఖర్.

సన్నగా నవ్వింది సుశీల ఆడవాళ్ళు జడల్లుకుంటుంటే, లోపలికి మాగాళ్ళు. అందులోనూ సోదరులు రాకూడదనే నియమం వున్నట్లు నే నెక్కడా వినలేదు, చదవలేదు తమ్ముడూ!" ఎంతసున్నితంగా ఆమాటలు పలికినా. చెమ్మాదారం సర్రున వేలుకోసుకున్నట్లు, సుతారంగా నెప్పితగిలే దెబ్బతగిలింది శేఖర్ కు.

"అక్కయ్యా! నీకో దణ్ణం పెడతాను! ఇప్పుడా విష యమై నాకో ఉపన్యాసం ఇవ్వకు. చచ్చిపోతాను....'' వాతావరణాన్ని తేలిక చెయ్యడానికీ, ఆమెకళ్ళలోని ఎరుపు జీర మాయమవటానికీ రానినవ్వు నవ్వుతూ అన్నాడు శేఖర్.

"ఇంతకూ ఏం పనో చెప్పనేలేదు?'' అంది దువ్వెనలో చిక్కుకున్న వెంట్రుకలు బ్రష్‌తో తుడిచేసి. దువ్వెన డ్రాయర్లో పడేస్తూ.

''ఏం లేదు ఊరికే....మాస్టారింకా రాలే?''

లోలోపల నవ్వుకుంది సుశీల అతగాడివేపు నిశితంగా చూస్తూ, ''వచ్చారు. బాత్ రూంలో వున్నారు, పిలవనా?'' అంది.

"ఊహూ. వద్దు....'' గబ్ బా మేడమెట్లువేపు వెళ్ళి పోయాడు శేఖర్. అల్లాగే కూర్చుండి పోయింది సుశీల. తెరలు తెరలుగా ఆలోచనలు వస్తున్నాయి.

ఓ రెండు నెలలుగా సుశీల గమనిస్తూనేవుంది శేఖర్ ప్రవర్తన! శేఖర్‌లో ఏదో అంతుతెలియని మార్పువస్తూంది రోజురోజుకూ. ముందులా అతగాడి కళ్ళలో అమాయకత్వం మాత్రమే కన్పించటంలేదు. 'అక్కయ్యా!' అనే ఆపిలుపులో కూడా ఈ మధ్య ఏదో వెలితి వుంటోంది. ఆ పిలుపు హృదయంలోంచి రావటం లేదనిపిస్తోంది. ఇంతక్రితం తనవేపు అతగాడు చూచేచూపులో నిశ్చలత్వం, ఓ విధమైన అమాయకత గూడుకట్టుకుని వుండేవి కానీ ఇప్పుడలాకాదు! చూపులో చంచలత్వం. కన్నుల్లో సన్నని ఎరుపుజీర, కంటి కొసల్లో

వక్రరేఖా, పెదవుల్లో కంపనా, అన్నీ ఏకమై తన శరీరం చుట్టూరా పరిభ్రమిస్తున్నట్లూ, శరీరమంతా ప్రాకుతున్నట్లూ స్పష్టంగా తెలుస్తోంది. ఏదో కుతూహలం, మరేదో పిపాస అతగాడిలో వుండవుండి విజృంభిస్తున్నాయని పిస్తోంది! చాలా సార్లు ఇలాంటి భావనే సుశీలక్కలిగింది. కానీ వెంటనే ఆమె వాత్సల్య పూరిత హృదయం ఆ భావనను పెరగనివ్వ లేదు! ఓహ్ ! నాకై నేనే లేనిపోనివి వూహించు కుంటున్నానేమో ? అనుమానిస్తున్నానేమో ? శేఖర్‌ని నేను స్వంత తోబుట్టువులా ప్రేమిస్తున్నాను. ఆదరిస్తున్నాను అలాంటప్పుడు అతగాడిలో, వికృతమైన భావసంచలనం కలగటానికి అవకాశం వున్నదా ? తరచూ ఇలా మనస్సులో మధన పడుతోంది సుశీల.

ఆమధ్య ఓసారి ఓ చిన్న సంఘటన జరిగింది. తలంటు స్నానంచేసి, తడిజుట్టు ఆరబెట్టుకుంటూ, చాపమీద కూర్చుని గోడకానుకుని ఏదో నవల చదువుతోంది సుశీల, నవలలో లీనమైపోయిన సుశీల ఎప్పటికో గానీ తలెత్తలేదు ! తలెత్తే సరికి కింది గుమ్మంలో నిల్చుని తనకేసే రెప్పార్పకుండా చూస్తున్నాడు శేఖర్ ! ఎందుకో గుండె ఝల్లుమంది క్షణకాలం. చెదిరివున్న పమిట సరిచేసుకుని, చెంపలమీద జీరాడుతున్న జుట్టు వెనక్కు తోసుకుని లేచి నిల్చుంది.

“ఏం తమ్ముడూ ! ఏమిటా వెర్రిచూపూ ? అంది కోపంగా !

"లేదక్కయ్యా !" క్షణకాలం తత్తరపాటుతో నిల్చొన్నాడు శేఖర్. మళ్ళీ సంబాళించుకుని, "మా నాన్నగారు జాబు వ్రాశారక్కయ్యా ! ఏదో పెళ్ళి సంబంధం, ఆడపిల్లను చూడాలి రమ్మంటూ ! అది చెబుదామనే వచ్చాను. నువ్వు నీ కలలో మునిగివున్నావ్, నిన్ను డిస్టర్బ్ చెయ్యటం ఇష్టంలేక నిల్చొన్నాను అదేమిటో అక్కయ్యా ! నీలో చాలా మార్పు కనిపిస్తోందీమధ్య!" అన్నాడు శేఖర్. అతగాడి మాటల ధోరణి మళ్ళీ మామూలుగానే వుంది క్షణంలో-అమాయకంగా !

ఛ.. ఛ.... నేనే పొరబడుతున్నానేమో ? మనస్సు మందలించింది సుశీలను.

"నేనా_మారానా ?" మనస్సులో భావాలు పైకి రానివ్వకుండా అడిగింది.

"ఊ! ఏమిటో వున్నట్టుండి కోపం వస్తోంది నీకు. పసివెధవని ! ఏదేనా పొరపాటుచేస్తే, నన్ను మందలించవచ్చుగా అలా కోప్పడటం, ముభావంగా వుండటం దేనికి!"

శేఖర్ ముఖంలో వుట్టిపడుతున్న అమాయకత్వానికి జాలేసింది సుశీలకు! నిజమే! అతగాడేదేనా పొరపాటుగా ప్రవర్తిస్తే మందలించగల చనవూ, స్థైర్యమూ, తనకున్నాయి. ఇక ఎందుకలా అతగాణ్ణి అస్తమానూ అనుమానించటం ?

"ఇంతకూ పెళ్ళికూతుర్ని చూచిరావటాని కెప్పుడు బయల్దేరుతావు? నాకు త్వరగా మరదల్ని చూపించాలి మరి!" నిండు హృదయంతో అంది సుశీల. "కానీ.... ఆ కాబోయే పెళ్ళికూతురు నాకు నచ్చొద్దూ ...? తెల్లగా నాజూకుగా....

అచ్చు" చటుక్కున పెదిమలు బిగబట్టుకున్నాడు శేఖర్. అతగాడు అనబోయిన 'నీలా' అనే మాటను పసిగట్టి గలి గింది. సుశీల మనస్సు కలత చెందంది.

"ఊఁ!" మౌనంగా లోపలికి వెళ్ళిపోయింది. సుశీల ఆ రో జు !

ఈరోజు మళ్ళీ ఈ సంఘటన ! ఏమిటీ వైపరీత్యం ? దీని నెదుర్కోవటం ఎలా !

"సుశీ ! ప్రాణం లేని అద్దాన్ని అలా ఎన్ని మార్లు ప్రశ్నించినా, నీ అందాన్ని వర్ణిస్తుందా ? నా వేపు చూడు.... నన్నడుగు.... నే చెబుతాను!" భాస్కర్ నవ్వుతూ, బలంగా రెండు భుజాల మీద చేతులు వేసి నవ్వుతున్నాడు. తెప్పరిల్లి ఆలోచనలకు స్వస్తి చెప్పింది సుశీల.

♦ ♦ ♦ ♦

నాలుగురోజుల తర్వాత ఆ రోజురాత్రి ఇక లోపల మధనపడలేక భాస్కర్‌తో అంది సుశీల.

"శేఖర్ ప్రవర్తనలో, చూపులో ఏదోమార్పు కని పిస్తోంది నాకు !

మెల్లగా నవ్వాడు భాస్కర్ "అవును!"

"మీకుతెలుసా?" విస్మయంగా చూచింది. భర్త వేపు.

"ఆ?" మధురంగా నవ్వాడు భాస్కర్.

"మరి....మరి....? ఆపైన అడగలేక పోయింది. వేయబోయిన ప్రశ్న గొంతులోనే అడ్డుపడి ఆగిపోయింది.

"నువ్వడగబోయే దేమిటో నాకు తెలుసు సుశీ?" మృదువుగా సుశీల చేతివ్రేళ్ళు తనచేత్తో రాస్తూ అన్నాడు భాస్కర్ .... "నీ మీద నాకు అనుమానం కలగలేదా అని నీ సంశయం అవునా? నాదగ్గరున్నది మేలిమి బంగార మని తెలిసీ, పదిమార్లు కంసాలిచేత బరువు వేయించి చూసేంత మూర్ఖుణ్ణి కాను నేను"

భాస్కర్ విశాలహృదయానికీ, అతగాడికి తనపై గల విశ్వాసానికీ, ఓ విధంగా ఆనందమూ, అలాటిభర్తను పొంద గలిగిన తన అదృష్టానికి గర్వమూకూడా కలిగాయి సుశీల కా క్షణంలో.

"పిచ్చిసుశీ! శేఖర్ పురుషుడు సాధారణ పురుషుల కుండే వికారాలు అతగాడిలోనూ వున్నాయ్ .... నువ్వు స్త్రీవి!" ఏదో చెప్పబోతున్న భాస్కర్‌కు అడ్డొచ్చి అడిగింది సుశీల....

"....కానీ నేను అతగాడికి అక్కయ్యాను!"

చిన్నగా నవ్వాడు భాస్కర్. "అక్కడే పొర బడ్డున్నావు. స్త్రీలు పెంచుకున్నంత త్వరగా పురుషుడునిష్క ల్మషమైన మమతను, బంధాన్ని పెంచుకోలేడు....నువ్వేం శేఖర్ స్వంత తోబుట్టువు కాదు .... చాలా మంది పురు షులు, స్వంత తల్లి, తోడబుట్టిన సోదరిల విషయంలో

మాత్రమే, పవిత్రానుబంధాన్ని ఏర్పరచుకుంటారు. కాస్త వేలు ఎడం అయిన స్త్రీని ఏ వరుసతోనేనా, ఏ వరుసే లేకానీ, నీచ దృష్టితోనే చూస్తారు. కలం స్నేహాల తంతు కూడా చాలా వరకూ ఇలాగే పరిణమిస్తోంది నాడు. 'అక్కయ్యా! అన్నయ్యా!' అనే సంబోధనలతో మొదలైన కలం స్నేహాలు నానురాను 'ప్రియా! ప్రేయసీ!' గా మారిపోతున్నాయంటే, కారణ మేమంటావు? రెండూ రెండు నెగటివ్ పోల్స్‌కున్న ఆకర్షణ సిద్ధాంతాన్నే ఇక్కడా అన్వయింప జేసుకోవాల్సి వస్తోంది ....

సుశీల కాస్సేపు మౌనంగా ఆలోచిస్తూండిపోయింది.. తర్వాత మెల్లిగా అంది ... "స్త్రీలలోనూ అలాటివారు లేరంటారా?"

భాస్కర్ సాలోచనగా అన్నాడు. "ఎందుకు లేరు? ఉన్నారు. కానీ స్త్రీ తనలోని కోర్కెనూ, తనలోరేగే భావాలను చటుక్కున వెల్లడించదు కారణం స్త్రీలోని సహజమైన లజ్జాస్వభావం కావచ్చు, లేదా సమాజాన్ని గురించిన భయం కావచ్చు. అన్నిటికంటే ముఖ్యమైంది వరుస - అంటే తను పిలిచే వరసలోని పవిత్రార్థం తాలూకు హెచ్చరికకూడా కావచ్చు! కానీ పురుషుని విషయం అలా కాదు అతగాడిలో 'కోర్కె' తాలూకు భావసంచలనం రేగడం మొదలెట్టిందంటే, ఇక అతగాడు సర్వం విస్మరిస్తాడు! ఆ కోర్కె తాలూకు 'పొర' అతగాడి కళ్ళనూ, మనస్సునూ, మేధనూ కప్పివేస్తుంది. అందులోనూ ముఖ్యంగా, తనతో కాస్త చనువుగా, సన్నిహితంగా, అమాయకంగా, కలుపుగోలు

తనంగావుండే పరాయి స్త్రీ విషయంలో అయితేమరీను. అతగాడి మనస్సు మరింత ఎక్కువగా అల్లరి ప్రారంభిస్తుంది. నే చెప్పడం మామూలు పురుషులను గురించి! సంస్కార పూరితులైన స్త్రీ పురుషులిలాటివాటికి అతీతులుగా వుంటారెప్పుడూ!"

సుశీల మౌనంగా వుండిపోయింది! భాస్కర్ చెప్పినదంతా ఆమె మనస్సులో మరెన్నో ఆలోచనల్ని రేపుతోంది!

"సుశీ" మెల్లిగా పిలిచాడు భాస్కర్.

"ఊఁ"

"చెయ్యి పట్టుకున్నాక చెంపదెబ్బ వెయ్యటంకంటే, ఆసన్నివేశం ఎదురవకుండా చూసుకోవటమే మంచిదని నా అభిప్రాయం ......" భాస్కర్ మనస్సువిప్పి చెప్పాడు.

సుశీల చిరునవ్వు నవ్వింది. "ఆభయం మీకక్కరలేదు శేఖర్‌లో అంత తెగింపు లేదు! కానీ ఇలాటి లేనిపోని ఊహాలకూడా తావులేకుండా, సమయంచూసి అతగాడి బలహీనతను హెచ్చరిస్తాను"....

"అతగాడి రూంలో నీ హాఫ్ సైజ్ చిత్రంవుంది!"

మెల్లిగా అన్నాడు భాస్కర్.

షాక్ తిన్నట్లయ్యింది సుశీలకు. "నా బొమ్మ గీసాడా?"

"ఆ ! చిత్రకారుడి దృష్టితో శేఖర్‌ను మనంచూస్తే అందులో తప్పేమీ కన్పించదు. కానీ, శేఖర్ బ్రహ్మచారిగా, యౌవనంలోని కోరికలు పేరుకుంటున్న వయసు కుర్రాడిగా, అతగాడి హృదయంలోకి తొంగి చూడగలిగితే మాత్రం, నీ చిత్రం అతగాడు గీసినతీరు, అతగాణ్ణి కేవలం చిత్రకారునిగా, అమాయకపు వాడిగా మాత్రం ఊహించుకో నివ్వడంలేదు ?"

"మీకెలా తెలుసూ" హీనస్వరంతో అడిగింది సుశీల.

"మొన్ననోరోజు లైబ్రరీనుంచి తెచ్చిన ఇంగ్లీషు నవలొకటి శేఖర్‌కు చదవటాని కిద్దామని మేడమీది కెళ్ళాను. నా రాకకూడా గమనించ లేనిస్థితిలో ఏదో బొమ్మ వేస్తున్నాడు శేఖర్ ! అతగాణ్ణి కదిలించటం ఇష్టంలేక, ఆ గీచే బొమ్మేదో చూడాలనే కుతూహలంతో మెల్లిగా అతగాడి వెనకగా వెళ్ళాను. నీ బొమ్మే ఫైనల్ టచస్ ఇస్తున్నాడు. నాకు తెలియకుండానే శ్వాస గట్టిగా పీల్చాను. అంతే. గాభరాగా డ్రాయింగ్ పేపర్, రంగు పెన్సిళ్ళు డ్రాయర్లోకి త్రోసి, వెనక్కు తిరిగిచూచి గతుక్కు మన్నాడు.

రాండి మేష్టారు ! ఎంతసేపైందివచ్చి .... .... అలా కూర్చోండి ! తడబడిపోతూ, నేనా బొమ్మను చూశానేమో నని హడలిపోతూ ముచ్చెమటలు పట్టిపోయాడు శేఖర్.

అలాటి సమయంలో ఆమనిషికి ఆ కంగారు కంటే ఎక్కువ శిక్ష మరొకటిలేదు. కాస్సేపు ఆకబుర్లు, ఈ కబుర్లు చెప్పి, నవల ఇచ్చి ఏమీ తెలియనట్లే వచ్చేశాను...."

తెల్లని జాబిల్లి మబ్బులమాటుకు వెళ్ళాడు, సుశీల మనస్సులో కూడా వరుసగా నల్లని మబ్బులు పేరుకుంటున్నాయి! తను తల్చుకుంటే శేఖర్‌ను ఎడాపెడా చీవాట్లువేసి, రూం ఖాళీ చేయించవచ్చు. కాని శేఖర్ ముఖంచూస్తూ తను అతగాణ్ణి వెళ్ళ గొట్టే సమయంలో, ఆ అమాయికమైన ముఖంలో కనిపించే అవమానమూ, భయమూ, చూసి తనే సహించలేదేమో! సోదరులు లేని తను, శేఖరును సోదరునిగా చేరదీసింది! పర్యవసానం ఇరువురికీ అవమానకరంగా, అసభ్యకరంగా వుండకూడదు; నిప్పును తాకాలనే ఉబలాటం పసి పిల్లలలో సహజంగానే వుంటుంది. అలాటి బిడ్డకు నిప్పు తాకించి, చెయ్యికాల్చి, మరీ తెలియ జెప్పటం మొరటుతల్లి చేసేపని! కానీ నిప్పుశగ మాత్రమే చూపించి, తద్వారా భయం కలిగించి, ఆ బిడ్డనా పనినుంచి విముఖుణ్ణి చెయ్యటం వివేకవంతురాలైన తల్లి చేయవలసినపని! శేఖర్ కళ్ళు తాత్కాలికంగా పొరలు క్రమ్ముకుంటున్నాయి. అవి మెల్లిగా తుడిచి, చూపు సరిగా ప్రసరించటానికి దోహదం చెయ్యటమే తనవిధి.

ఓనిర్ణయానికి వచ్చింది సుశీల. అప్పుడే ఆమెకు మాంచి నిద్ర ముంచుకు వచ్చింది కూడా.

◆ ◆ ◆ ◆

భాస్కర్ క్లబ్బుకు వెళ్ళాడుశేఖర్ కూడా ఎక్కడికో వెళ్ళాడు. సాధారణంగా శేఖర్ బయటికి వెళ్ళేటప్పుడు తన రూం తాళపు చెవి హాల్లో మేకుకు తగిలించి వెళ్తాడు.

అప్పుడప్పుడూ ఏవేనా నవలలు వగైరా తీసుకోవటానికి భాస్కర్ గానీ, రూం పనిమనిషిచేత కడిగించటానికి, కూజాలో నీళ్లు పెట్టించటానికీ సుశీలకూడా తాళం తీసి వెళ్ళి మళ్ళీ తాళం వేసుకవస్తారు! ఆ ఇంట్లో ఆ ముగ్గురి మధ్యా ఇలాటి చిన్న విషయాలలో ఎలాటి పట్టింపూ లేదు.

మెల్లగా తాళంచెవి తీసుకు మెడమీదకు వెళ్ళింది సుశీల గదితాళంతీసి లైటు వేసింది. టేబిల్ మీద పుస్తకాలు చిందరవందరగా పడివున్నాయి. రంగు పెన్సిళ్ళూ, వాటర్ కలరు బాక్సూ, కుంచె ఏవేవో అసంపూర్తి చిత్రాల తాలూకు స్కెచ్‌లూ గజిబిజిగా గదంతా పరచుకుని వున్నాయి.

పిచ్చిపిల్లాడు! రూం ఎంత రభసగా వుంచుకున్నాడో! వాత్సల్యం ఒక్కసారి పెల్లుబికింది సుశీలలో! అన్నీ ఏరి సరిచేసి, డ్రాయర్ తీసింది, జాగ్రత్తగా రెండు ఉల్లిపొర పేపర్లలో చుట్టి స్ఫష్టాస్ఫష్టంగా కనిపిస్తోంది, చిత్రం!

అందాకావున్న భావన మళ్లీ తొలగింది. గబుక్కున ఆ చిత్రం బయటికి తీసింది.

కళ్ళు పెద్దవి చేసుక మరీ చూచింది సుశీల. తలంటు పోసుకున్న జుట్టు సగభాగం చెంపలమీదుగా జీరాడుతోంది. ఎడంవేపు, రింగులు తిరిగిన ముంగురులు నుదుటిమీదబొట్టు కడ్డంగా పడ్తున్నాయి గోడ కానుకుని కూర్చుని ఏదో పుస్తకం చదువుతూనో. ఆలోచిస్తున్నట్లోవున్న సోగకళ్ళు అర్థ నిమీలితాలుగా అందంగా వున్నాయి. ఆ ధ్యాసలో వున్న ఆమె పైట సరిగా లేదు.

సుశీల మనస్సు కుతకుత ఉడికి పోయింది క్షణకాలం. తను నవల చదువుకుంటూ కూర్చొని వున్నప్పుడు ఆ రోజు.... ఆ క్షణంలోని తనరూపాన్ని శేఖర్ హృదయం ఫోటో తీసింది. దానినే తిరిగి పదిలంగా డ్రాయింగ్ పేపర్ మీద ముద్రించాడు !

"ఎవరో దొంగలు నాగదిలో ప్రవేశించారల్లే వుంది ?" మాటలు విని తలెత్తిచూచింది సుశీల. గది గుమ్మానికి రెండు చేతులూ ఆన్చి నిల్చొని శేఖర్ నవ్వుతున్నాడు. ఆ చూపులో చంచలత్వం, కంటికొనల్లో వక్రరేఖా కళ్ళల్లో ఎర్రని జీరా స్పష్టంగా కన్పిస్తున్నాయి పెదవులెందుకో సన్నగా కంపిస్తునాయి.

"ఇతరుల వస్తువులు దోచుకోవాలనే అల్పబుద్ధి నాకు లేదు తమ్ముడూ ! రా లోపలికి" ఆ కంఠస్వరంలో ఏదో తెలియని ఆజ్ఞ నిండివుంది. విస్మయంగాచూస్తూ లోపలికి వచ్చి, సుశీల కొంచెం దూరంలో నిల్చున్నాడు శేఖర్.

"ఇంతకూ ఈ బొమ్మ నువ్వేనా వేసింది తమ్ముడూ?" తన చిత్రాన్ని చూపించింది సుశీల

"ఆ!" గర్వమూ, కించిత్తు భయమూ కలసి వున్నాయా ఒక్క అక్షరంలోనూ !

సుశీల కళ్ళు ఎర్రగా మారాయి.

"నేను నీకో మారు చెప్పాను గుర్తుందా తమ్ముడూ" ?

శేఖర్ ప్రశ్నార్థకంగా చూశాడు.

"స్త్రీ మూర్తి రూపకల్పన చెయ్యదల్చుకుంటే, ముందస్తుగా నిగ్రహమూ, తర్వాత పవిత్రతా, ఆ తర్వాత ఏకాగ్రతా వుండాలనీ. లేకుంటే వారికి స్త్రీమూర్తి రూపకల్పన చేసే అర్హతకూడా లేదని...గుర్తుందా ?"

తలూపాడు శేఖర్ చిత్తరువులా. అతగాడి హృదయ స్పందన వేగం హెచ్చవుతోం దెందుకో.

"స్త్రీలతో స్నేహం చెయ్యటానికూడా పై మూడూ అవసరం తమ్ముడూ!" శేఖర్ నిశ్చేష్టుడై నిల్చుండిపోయాడు. అతగాడికి కొద్దికొద్దిగా తన స్థితీ, మానసిక పరిస్థితీ, ఈమధ్య మారిన తన ఆలోచనల గతీ కూడా అర్థంకావడం మొదలెట్టింది !

"నన్ను 'అక్కయ్యా' అనగానే ఎంతో సంబరపడి పోయాను. నిన్ను నా తమ్ముడిలానే ఆదరిస్తున్నాను. కాని నీలో ఎందుకు మార్పువచ్చిందో నాకుబోధపడటంలేదు .... ఆమార్పు కేవలం నా అనుమానమేమోనని సరి పెట్టుకుందా మనుకున్నాను.... కానీ ఈ చిత్రం నా అనుమానాన్ని దృఢపరుస్తోంది! నీ మనస్సులో కొద్దికొద్దిగా పేరుకుంటున్న మకిలిని స్పష్టంగా బయటకు చూపిస్తోందీ చిత్రం !"

శేఖర్ మాట్లాడలేక పోయాడు. సూటిగా సుశీలను చూడలేక తలవంచుకున్నాడు.

"తమ్ముడూ ! అలా తలవంచకు....నాకేసి సూటిగా చూడు ! నీ స్వంత తోబుట్టువే నేనైతే, ఈ భంగిమలో

ఇలా నన్ను చిత్రించగలవా? ఊహూ.? ఏనాడూ చిత్రించలేవు? అసలలాంటి భావనకూడా కలగదు నీలో. అవునా? కానీ నా బొమ్మ గీయబోయేసరికి నీకింత సంకుచితదృష్టి ఎలా ఏర్పడింది? నన్ను 'అక్కయ్యా' అంటూనే మరో విధమైన అతి సంకుచితమైన భావపరంపర నీలో చోటు చేసుకుంది కదూ?

"నీ చదువు, సంస్కారమూ అంతవరకేఆగిపోయాయేం తమ్ముడూ? నా చనువూ, సన్నిహితత్వం. కేవలం నీలో పురుష వికారాన్ని మాత్రమే రెచ్చగొట్టిందంటే నా మీద నాకే కోపం వస్తోంది! స్వచ్ఛమైన స్నేహానికీ, నిర్మలమైన పిలుపుకూ, నీ హృదయం ఇంకా ఎదగలేదా తమ్ముడూ?" సుశీల నోటినుంచి వెలువడ్తున్న ప్రతి అక్షరమూ, శేఖర్ హృదయానికి సూటిగా బాకులా తగిలింది! అతగాడిలో కొత్తగా తలెత్తిన మరో శేఖర రూపాన్ని బాకులు చిత్రవధ చేసివేసాయి క్షణకాలంలో; నిజమే! తనని తోబుట్టువులా ఆదరించిన సుశీల అక్కయ్యను గురించి అసహ్య కరమైన వూహ లెందుకు తనక్కలిగాయి? ఇది తన వయసు చేసిన మోసమా? యౌవనోద్రేకం కలిగించే వత్తా? లేక తన సంస్కారపు విలువ దిగజారిందా? ఏమో? ఏది ఏమైనా తను చేసింది పొరబాటు. అక్కయ్య చిత్రం గీయటంలోనూ అదే పొరబాటుచేశాడుతను! పవిత్రంగా వుండే అక్కయ్య ముఖం, అందానికి ప్రతిబింబంగా వుండే ఆమె శరీరమూ, తను చిత్రానికి అనువుగా మలుచుకోవడంలో పొరబాటు లేదు. కానీ ఎటొచ్చి....జుగుప్సాకరంగా చిత్రించి....అక్క

య్యన్నట్లు, తనలోని మకిలిని వెలికి తీస్తోందా చిత్రం ! సుశీ లక్కయ్య కాబట్టి తన నింత మృదువుగా మందలిస్తోంది ! ఇదే మరో స్త్రీ అయితే - తన్ని తగిలేసేదేమో ? అసలు భాస్కర్ కూడా ఆరోజు తన వెనకనుంచి చిత్రాన్ని చూసి వుంటాడనే అనుమానం వేస్తూనే వుందిలే ! ఎంత పెద్దమనిషి గాకుంటే భాస్కర్ తననలా తెలియనట్లు వదిలేస్తాడు ?

సుశీల, భాస్కర్ యిద్దరి కిద్దరూ సంస్కార పూరితులు తనే పెడత్రోవ తొక్కాడు.

ఒక్కసారిగా శేఖర్‌లోని మరో శేఖర్ తీసుక తీసుక చచ్చాడు ? శేఖర్ కళ్ళు పరిశుభ్రంగా మిలమిల లాడాయి ! ఆ కళ్లలో పశ్చాత్తాపం తాలూకు నీళ్ళు తళ తళ లాడ్తున్నా యిప్పుడు.

"అక్కయ్యా" అర్ధ్రింగా పిలిచాడు శేఖర్ అతగాడి స్వరం కంపిస్తోంది.

"ఊ"

"మరెప్పుడూ ఇలాటి పొరబాటు చెయ్యను, ఈ ఒక్క సారికీ క్షమించు నన్ను !" శేఖర్ తల పైకి లేపటం లేదు. కాళ్లు పట్టుక నమస్కరించటానికి సందేహిస్తున్నాడే గానీ, అత గాడు హృదయంలోనే ఆ పని చేస్తున్నాడని సుశీలకు తెలుసు.

మెల్లిగా నవ్వింది. "పొరబాట్లు చెయ్యడం మానవ సహజం. మొదటి పొరపాటు 'ఫలానా' అని తెలుసుకుని, అది సరిదిద్దుకోవటంలోనే గొప్పతనంవుంది శేఖర్ ! ఇదిగో చిత్రం...." చిత్రం అతగాడి చేతికిచ్చింది సుశీల.

చూస్తుండగానే పరపరచింపి, కిటికీలోంచి బయటికి పారేసాడా ముక్కల్ని.

"నా హృదయంలోని మలినంతో తయారైన ఈ చిత్రం ఒద్దక్కయ్యా ! ఈ క్షణం నుంచీ, నీ వెనకటి తమ్ముడే నీక్కనిపిస్తాడు. మధ్యలో వచ్చిన వెధవ తమ్ముడు మాయమై పోయాడు...నన్ను నమ్ముతావా అక్కయ్యా ?"

"నమ్ముతాను తమ్ముడూ ! మరెప్పుడూ ఇలాటి తప్పు చెయ్యవనీ నాకు తెలుసు" అంది సుశీల నిండు హృదయంతో మెట్లకేసి వెడుతూ.

"అక్కయ్యా ! ఒక్క నిముషం "అలాగే నిలబడు." గబుక్కున పిలచి, డ్రాయింగ్ పేపర్, పెన్సిల్ తెచ్చుక, సుశీలవేపు చూస్తూ గబగబ స్కెచ్ గీసుకున్నాడు శేఖర్.

సుశీల చిన్నగా నవ్వింది, "తప్పుచెయ్యకు తమ్ముడూ!" అంది సుస్మితంగా.

"ఊహుఁ ! చేసిన తప్పు దిద్దుకుంటున్నా నక్కయ్యా!"

తేలిక పడిన మనసుతో కిందికి దిగి వచ్చింది సుశీల. చిత్రం పూర్తి చెయ్యడంలో మునిగి పోయాడు శేఖర్. పూర్తయిన చిత్రం వేపు చూచాడు. గంభీరంగా నిల్చునివున్న సుశీల మృదు మధురంగా నవ్వుతూ, వాత్సల్య పూరితంగా కళ్ళతోనే హెచ్చరిస్తున్నట్లుంది. "తమ్ముడూ! తప్పుచెయ్యకు" అంటూ.

తలవంచాడు శేఖర్ గౌరవభావంతో.

('జయశ్రీ' జనవరి 1967)